www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 జూలై 2023
5
అన్నమయ్య



రైతు భరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూమ్‌బాష ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగపు అధికారులు పి.రామకృష్ణ, వ్యవసాయ అధికారి ఇ.బాలగంగాధర్ రెడ్డి, ఎఇఇ కిషోర్, రాజంపేట మండల వ్యవసాయ అధికారి రాజకుమారి గురువారం తాళ్లపాక, మదనగోపాలపురం రైతు భరోసా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాలలో వాతావరణ సమాచారాన్ని, మార్కెట్ ధరలను తెలియపరచే కియోస్కులను, ఆర్‌బికెలకు ప్రభుత్వం అందించిన ఇతర పరికరాలను, గ్రంథాలయం, గోదాములను తనిఖీలు చేశారు. ఆర్‌బి.కెలలో రైతులకు సరఫరా చేసిన విత్తనాలు, ఎరువులు, ఈ క్రాపింగ్ నమోదు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్.కె ల ద్వారా వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు మంజూరైన యంత్ర పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ అధికారి మాట్లాడుతూ తనిఖీలలో రైతు భరోసా కేంద్రాలలో గుర్తించిన విషయాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులతో పాటు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ వ్యాపారం తగ్గుముఖం

పనిచేసేందుకు ముందుకు రాని కార్మికులు
జిల్లా వ్యాప్తంగా 12 బీడీ ఫ్యాక్టరీలు
నష్టాల ఊబిలో యాజమాన్యాలు



ప్రజాశక్తి - రాయచోటి

ఒకప్పుడు రాయచోటి ప్రాంతంలో బీడీల తయారీకి పెట్టిందిపేరు. వ్యాపారం కూడా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగేది. బీడీ ఫ్యాక్టరీలను నమ్ముకుని చుట్టుపక్కల ప్రజలు ఉపాధి పొందేవారు. రానురానూ వ్యాపారం తగ్గుముఖం పట్టడంతో ఫ్యాకర్టీ యాజమాన్యాలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నేడు బీడీ పరిశ్రమలు కనుమర ుగయ్యాయి. ప్రస్తుతం కేవలం ఒక రాయచోటిలో మాత్రమే 12 బీడీ ఫ్యాక్టరీలున్నాయి. ఫ్యాక్టరీల వల్ల కొంతమంది కార్మిక కుటుంబాలు మాత్రమే జీవనం సాగిస్తున్నాయి. కానీ బీడీ ఆకు చుట్టడానికి నేడు కార్మికుల కరువయ్యారు. ఉన్నవారితో పని చేస్తున్నప్పటికీ అనుకున్నంత వ్యాపారం సాగడం లేదని బీడి ఫ్యాక్టరీ నిర్వాహకులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, తేజర ప్రాంతాల నుంచి పౌడర్, పొగాకు తీసుకువచ్చి వాటిని శుభ్రం చేసి బీడీలుగా చుట్టి మార్కెట్లోకి విక్రయిస్తున్నామని చెప్పారు. కార్మికులు గతంలో మాదిరిగా ఫ్యాక్టరీలో పనిచేసేందుకు ముందుకు రాకపోవడంతో అనుకున్నంత లక్ష్యంలో బీడీల తయారీ తగ్గుముఖం పట్టింది. కేవలం 45 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక్క డి నుంచి బీడీలను రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పెద్దమండెం ,చిన్నమండెం ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు బీడీ ఫ్యాక్టరీలో వైద్యం సౌకర్యం, గుర్తింపు కార్డులు అందించాలని కార్మికులు కోరుతున్నారు. బీడీ ఆకుపై జిఎస్‌టి ఎత్తేస్తే రాబోవు రోజుల్లో బీడీ వ్యాపారం పెరిగి మరిన్ని పరిశ్రమల స్థాపనకు అవకాశముంటుందని ఫ్యాక్టరీ యజమానులు పేర్కొంటున్నారు. బీడీ ఆకుపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టి వేయడం వల్ల వ్యాపారానికి పెనుబారంగా మారిందిని ఫ్యాక్టరీ యాజమానులు చెబుతున్నారు. రాయచోటిలోని అన్ని ఫ్యాక్టరీలకు లైసెన్సులు ఉన్నప్పటికీ



బీడీలు చుడుతున్న కార్మికులు

అందులో పని చేసేందుకు కార్మికులు మొగ్గు చూపకపోవడంతో బీడీ ఫ్యాక్టరీలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉన్నాయి. కూలి తక్కువగా ఉందని కొందరు, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని మరికొందరు కార్మికులు పనిచేసేందుకు ముందుకు రావడం లేదని యజమానులు పేర్కొంటున్నారు. గతంలో పనిచేసేవారితోనే పనిచేయిం చుకుం టున్నామని, కొత్తవారు ఎవరూ ముందుకు రావడం లేదని వాపోయారు. బీడీ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు హెల్త్‌కార్డు, గుర్తింపు కార్డులు ప్రభుత్వం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



బీడీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. పొగాకుతో బీడీలు రోజూ చుట్టడం వల్ల అనేక ఆరోగ్య సమ స్యలు కూడా వస్తున్నాయి .ప్రభుత్వం కులవృత్తిదారులకు ఇస్తున్నటువంటి వేతనం కార్మికులకు ఇవ్వాలి. పెన్షన్, హెల్త్‌కార్డులు ఇవ్వాలి.

-జఫీవుల్లా, కార్మికుడు, రాయచోటి

నూతన ఫ్యాక్టరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

ఎవరైనా జిల్లాలో నూతన బీడీ ఫ్యాక్టరీలు నిర్మించుకోవాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి లైసెన్సులు మంజూరు చేస్తాం. బీడీ కార్మికులందరు ఇన్సూరెన్స్ కార్డులు దరఖాస్తు చేసుకోవాలి.

- డి.వి. రంగరాజు , కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, అన్నమయ్య జిల్లా.

ఉద్రిక్తం

- దీక్షను పట్టించుకోని ఎంపీ మిథున్‌రెడ్డి
- కాన్వాయ్‌ను అడ్డుకున్న కార్మికులు
- రోడ్డుపై బైఠాయించి ఆందోళన
- కార్మికులపై పోలీసుల మూకుమ్మడి దాడి
- పలువురు నాయకులు అరెస్టు
- స్తంభించిన ట్రాఫిక్



ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు



నాయకులను, కార్మికులను లాగేస్తున్నపోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మదనపల్లె డిఎల్‌పిఒ కార్యాలయం ముందు చేస్తున్న చేస్తున్న నివధిక దీక్ష గురువారం ఉద్రిక్తంగా మారింది. గురువారం మదనపల్లెకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డికి కార్మికులు తమ సమస్యలను విన్నవించేందుకు ప్రయత్నించగా ఆయన పట్టించుకోకుండా దీంతో ఆగ్రహించిన కార్మికులు ఎంపీ కాన్వయ్‌ను అడ్డుకుని తిరుపతి రోడ్డుపై బైఠాయించారు. గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రజాప్రతినిధులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. అక్కడే ఉన్న రెండో పట్టణ సిఐ మురళీ కృష్ణ తన సిబ్బందితో కలిసి కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్మికులు ససేమిరా అనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడి చేశారు. ఆందోళన కారులను జీపులోకి ఎక్కించి అరెస్టు చేశారు. మహిళలు అని కూడా చూడకుండా వాహనాల్లో ఎక్కించారు. ఆందోళన కారులను రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం జిల్లా కారయదర్శి శ్రీనివాసులు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, శంకర ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరితే అరెస్టు చేస్తారా?

ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధున్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నవాజ్ బాషాలకు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలు, కార్మికుల సమస్యలు పట్టడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కొనలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒలను అమలు చేయాలని కోరడమే అన్యాయం అన్నట్లుగా ప్రభుత్వ పెద్దలు వ్యవహారించడం సరైంది కాదన్నారు. కార్మికులకు ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, వేతనాలు బ్యాంకు ద్వారా ఇవ్వాలని కోరితే, కేసులు పెడతారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు అందినకాడికి దండుకోవడం కోసమే వేతనాలు బ్యాంకులో ఇవ్వడం లేదని విమర్శించారు. హైకోర్టు తీర్పు అమలు చేయాలని, కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికులకు మట్టి ఖర్చులు రూ.25 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలని అక్రమ అరెస్టులు చేసి భయపెట్టాలి అనుకోవడం అవివేకం అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు సురేంద్ర, రఘునాథ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు గోపాల్, ఇమ్రాన్, నాగరాజు, ప్రమీల, శ్యామల పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

రాయచోటి టౌన్ : పెండింగ్ వేతనాలు అడిగితే పోలీసులు నాయకులను, కార్మికులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సిఐటియు జిల్లా ఉఫాధ్యక్షుడు ఎ.వి. రమణ, జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మదనపల్లి రూరల్ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పట్ల మూడు రోజులుగా ముందస్తు నోటీసు ఇచ్చి శాంతియుతంగా నిరసన చేస్తున్నారని చెప్పారు. గురువారం ఎంపీ మిథున్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తే కార్మికులను , సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి .శ్రీనివాసులు అత్యుత్సాహంతో పోలీసులు అరెస్టు చేయడం దారుణమని వాపోయారు. అరెస్టయిన వారిని విడుదల చేయకపోతే శుక్రవారం పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు యస్ .ఫయాజ్ నాయకులు విజయమ్మ పాల్గొన్నారు.



అమ్మఒడి మెగా చెక్కును తల్లులకు అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి


పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఒక మనిషి తల రాతను మార్చడానికి చదువుకు మాత్రమే సాధ్యమని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను బాగా చదివించాలని రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం మదనపల్లె పట్టణంలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్‌లో మదనపల్లె నియోజకవ ర్గానికి సంబంధించి అమ్మ ఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని చెప్పారు. కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ప్రతి ఒక్కరికి ఉచితంగా అందజేయాలనే ఆశయంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. పిల్లలందరూ రోజూ బడులకు వెళ్లాలని 75 శాతానికి తక్కువ కాకుండా హాజరు ఉండాలన్నారు. మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాష మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని విద్యార్థులు బాగా చదివి ఇంజనీర్లు డాక్టర్లు కావాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందించే పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మదనపల్లె నియోజకవర్గంలోని అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15,000 వేలు చొప్పున 110290 మంది విద్యార్థుల తల్లులకు సంబంధించి రూ.165.44 కోట్ల రూపాయల మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, చిత్తూరు జడ్‌పి చైర్మన్ వాసు, ఏపీఎండిసి చైర్మన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ మనోజ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింక చలపతి, ఆర్డీవో మురళి, డీఈవో పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంధనం పొదుపు చేద్దాం

పీలేరు : ఇంధనం పొదుపు చేస్తూ డిపో ఆర్థికాభివృద్ధికి కృషి చేద్దామని పీలేరు ఆర్టీసి డిపో మేనేజర్ బండ్ల కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇంధన పొదుపుతో డిపో ఖర్చు తగ్గి, ధనం ఆదా చేసినట్లేనని అన్నారు. ప్రతి డ్రైవర్ ఇంధన పొదుపుపై శ్రద్ధ చూపి డిపోని అత్యధిక ఇంధన పొదుపు డిపోగా అభివృద్ధి వైపుకు నడపాలని కోరారు. ఈ సందర్భంగా అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లకు నగదు బహుమతిని ప్రదానం చేశారు. 78 లీటర్ల డీజిల్ ఆయిల్ పొదుపు చేసిన డ్రైవర్ విఎల్ నాయుడుకు ప్రథమ బహుమతిగా రూ.500 నగదును, అలాగే 77 లీటర్లు డీజిల్ ఆయిల్ పొదుపు చేసిన మరో డ్రైవర్ బి.ఆర్.సి నాయక్ కు ద్వితీయ బహుమతిగా రూ.300 నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు నగదు బహుమతి ప్రధానం చేస్తున్న డిఎం



గడపగడపకూ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సంబేపల్లి (రాయచోటి)

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలును అందించడమే తన లక్ష్యమని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లె మండలం నాగిరెడ్డిగారిపల్లె లో ఉదయం 6 .30 గంటలకే గడప గడప కు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మి, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్ రెడ్డి ,మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రమణా రెడ్డి,ఆవుల మల్లికార్జున రెడ్డి, మండల జె సి ఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి తదితర నాయకులు, అధికారుల బృందంతో దళితవాడ, మొటుకువాండ్లపల్లె, బండకాడపల్లె దళితవాడ,బండకాడపల్లె, వంక వార దళితవాడ, నాగిరెడ్డిగారిపల్లె, ఇరగనేని వాండ్లపల్లె, కంబెల్ల వాండ్లపల్లె, అన్నప్పగారిపల్లె, గోరావాండ్లపల్లె,పోతు వాండ్లపల్లెలలో ఎమ్మెల్యే పర్యటించారు. పల్లెల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నా యన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ వేలాది, లక్షలాది రూపాయలు లబ్ధిపొందారని చెప్పారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు చేర్చారని తెలిపారు. అర్హత ఉండి ఇళ్లు రానివారికి గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరీ భాయి, ఎంపిడిఓ నరసింహులు, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, మాజీ ఎంపిపి జాండ్ల సరస్వతి, మాజీ వైస్ ఎంపిపి నాగా రంజాన్ వలీ, సర్పంచులు యువరాజు నాయుడు, వెంకట రమణ నాయక్, మోహన్,పాల వెంకట రమణ నాయుడు, బిసి సెల్ నియోజక కన్వీనర్ నాగరాజు యాదవ్, రఘునాథ రెడ్డి, దండు నాగభూషన్ రెడ్డి, పలవలి అమర నాథ రెడ్డి, ఎంపిటిసి లు భద్రయ్య, శ్రీధర్ రెడ్డి, కాకులపల్లె రమణా రెడ్డి, నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

సేవలకు సార్ధకత కల్పించాలి

వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి వారిని ఆదరించడం ద్వారా సార్ధకత కల్పించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం మండలంలోని మంచూరులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సహకారంతో మంచూరులో రూ. కోటి 70 లక్షలతో శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ జీర్ణోదరణ పనులను చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజలకు కనిపిస్తారని, ఎన్నికలు అయిపోయాక ఆయనకు నియోజకవర్గ ప్రజలు గానీ, నియోజకవర్గంగానీ కన్పించరని చెప్పారు. హైదరాబాదులో ఉంటూ విజిటర్లుగా నియోజకవర్గానికి అడపాదడపా వచ్చే ప్రతిపక్ష నాయకులను నమ్మి మోసపోరాదన్నారు. ఎల్లవేళలా ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు అండగా నిలిచి చేయూతనివ్వాలని కోరారు. సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలు, కుల మతాలు చూడకుండా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత దేశంలోనే రాష్ట్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైసిపి బిసి సెల్ కార్యదర్శి రాయుడు మాట్లాడుతూ పరిపాలనను ప్రజలకు చేరువగా తీసుకువచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీఎం సేవలు ఆదర్శనీయం

సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ్య ఆస్పత్రి ప్రారంభంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యం అందించడంలో పద్మభూషణ్, సత్సంగ్ ఫౌండర్ శ్రీఎం (ముంతాజ్ అలి) ఆదర్శనీయమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. పట్టణంలోని నక్కలదిన్నెలో సంస్థ ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరిలో అప్పటి భారత రాష్ట్రపతి రామ్ నాథ్‌కోవింద్ శంకుస్థాపన చేసిన 50 పడకల మల్టీ స్పెషాలిటీ స్వస్త్య ఆసుపత్రిని నితిన్ గడ్కరి గురువారం ప్రారంభించారు. ముందుగా బిటీ కళాశాల మైదానానికి చేరుకున్న ఆయనకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రాజు, కలెక్టర్ గిరిష పిఎస్, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాష, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ మనోజా రెడ్డి, జడ్పిటిసి ఉదయ్ కుమార్, మదనపల్లి ఆర్డీవో మురళి స్వాగతం పలికారు. అనంతరం సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వస్త్య ఆస్పత్రి ప్రాంగణానికి చేరకుని ప్రారంభించారు. ఆస్పత్రిలోని విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీ ఎం ఆధ్యాత్మిక వేత్త మాత్రమే కాకుండా సంఘసంస్కర్త అని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. కోవిడ్ - 19 సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని మదనపల్లిలో ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని సంకల్పించారు. ఈ ఆసుపత్రిని ఇప్పుడే సందర్శించానని, ఇందులో అన్ని రకాల సేవలు అందించడం అభినం దనీయమని కొనియాడారు. మదనపల్లె దగ్గర ఉన్న జాతీయ రహదారులపై ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే వారికి అత్యవసర సేవలు అందించడానికి స్వస్త్య ఆసుపత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. శ్రీ ఎం మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తలమానికంగా, పేదలకు అందుబాటులో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 24 ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి బిజెపి రాజంపేట పార్లమెంటు జిల్లా ప్రెసిడెంట్, ఎం.పార్థసారథి కదిరి మాజీ ఎమ్మెల్యే, ఏ.మంగరాజు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తంబళ్లపల్లె, నాగరెడ్డెమ్మ రాష్ట్ర బిజెపి ఇసి సభ్యులు కె.అంజనమ్మ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు కె. రవీంద్ర రాష్ట్ర గిరిజన మోర్చా సెక్రటరీ ఎం.వేణుగోపాల్ రాష్ట్ర ఓబిసి మోర్చా ఈసీ నెంబర్, శంకర్ మూర్తి బిజెపి టౌన్ ప్రెసిడెంట్, సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ

అక్రమ బదిలీలు వెంటనే ఆపాలి : యుటిఎఫ్



నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -రాయచోటి

ప్రభుత్వ సిఫారసు పేరుతో చేస్తున్న అక్రమ బదిలీలు తక్షణమే నిలువుదల చేయాలని, ఉపాధ్యాయుల జీత భత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.హరి ప్రసాద్ షేక్ జాబిర్ డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ రాష్ట శాఖ పిలుపు మేరకు రాయచోటిలో డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ బదిలీలకు వేలాది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా 52వేలమందికి బదిలీలు ఇచ్చారని చెప్పారు. కేటాయించిన స్థానంలో పోస్టు ఖాళీ లేకపోవడం, సాంకేతిక, ప్రభుత్వ వైఫల్యాలు కారణంగా ఇప్పటికీ చాలామంది ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వలేదన్నారు. సిఫారసు బదిలీలు చేపట్టడం వల్ల మొత్తం బదిలీల ప్రక్రియ అవహాస్యానికి గురయిందని పేర్కొన్నారు. బదిలీల బాధితులకు జిల్లాలో చిట్టచివరి ప్లేసులు కేటాయిస్తున్నారని చెప్పారు. బదిలీల జాబితాలో ప్రమోషన్ పొందిన వారి పేర్లు చివరన చేర్చి సుదూర ప్రాంతాలకు కేటాయించారని పేర్కొన్నారు. బదిలీల తర్వాత ఏర్పడిన ఖాళీలు భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రమోషన్ల కౌన్సెలింగ్‌లో మంచి ప్లేసులు జూనియర్లకు కేటాయించారన్నారు. ప్రమోషన్ల కౌన్సిలింగ్ నిర్వహించడంలో అధికారుల వైఖరి సీనియర్లకు అన్యాయం చేసిందని తెలిపారు. ప్లస్ టూ హైస్కూళ్లలో 1746 మంది పీజీ టీచర్లను నియమించారని, ఇటీవల ఎంఇఓ-1 పోస్టులు కొన్ని భర్తీ చేసినా ఇంకా 162 మండలాలకు ఎంఇఓ -1 లేరని వాపోయారు. కొత్తగా నియమించిన ఎంఇఓ-2లకు డ్రాయింగ్ పవర్ ఇవ్వకపోగా కనీసం ప్రక్క మండలాల ఎంఇఓ-1లకు అయినా ఎఫ్ఎసి ఇవ్వలేదున్ననారు. ఈ కారణాలరీత్యా దాదాపు 50వేల మంది ఉపాధ్యాయులకు జూన్ నెల జీత భత్యాలు ఇంతవరకు చెల్లింపు కాలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయాలని, లేని పక్షంలో పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.చంద్రశేఖర్, జిల్లా సహాధ్యక్షురాలు కె. హేమలత, జిల్లా కార్యదర్శులు సుధాకర్ నాయుడు, ఎం రమణయ్య, అక్రమ బాష, ఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్, సుబహాన్, హఫీజుల్లా, డి.ఉమ శంకర్, కిఫాయతుల్లా ఎన్. శ్రీనివాసులు, రాజబాబు, దావుద్దీన్, రెడ్డి బసయ్య, విజయ్ కుమార్, సురేంద్ర, చలపతి పాల్గొన్నారు.



మహిళా సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే గది

మహిళా సెక్యూరిటీల సమస్యను పరిష్కరించరూ..

- మొండి గోడల మధ్యే విధులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

విద్యార్థినులకు రక్షణ కల్పిస్తున్న మహిళా సెక్యూరిటీలకు రక్షణ లేకుండా పోయింది. పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదుగురు మహిళలు అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక మహిళ సెక్యూరిటీ సూపర్వైజర్‌గా నలుగురు మహిళలు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో సెక్యూరిటీ గార్డుల కోసం నిర్మించిన గది మూడేళ్లయినా పూర్తి చేయకుండా మొండి గోడలతో వదిలేశారు. స్లాబ్ వేసి గోడలు నాలుగు వైపులా పూర్తి చేయకుండా సగం వరకే నిర్మించి తలుపులు బిగించడం మరిచారు. వర్షాకాలంలో వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు. విషపురుగులు సంచరిస్తుండటంతో రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటున్నారు. మంచినీరు, మరుగుదొడ్డి వంటి కనీస వసతులు కూడా కల్పించలేదని వాపోయారు. ఉదయం, సాయంత్రం వేళల్లో యూనిఫామ్ దుస్తులు మార్చుకోవడం కోసం విద్యార్థుల మరుగుదొడ్లలోకి వెళ్లి మార్చు కోవాలని పరిస్థితి ఏర్పడిందన్నారు. వేతనాలు కూడా నెలనెలా సక్రమంగా అందడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి గదినిర్మాణాన్ని పూర్తి, వేతనాలు నెలనెలా అందేలా చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని వెలుగు మహిళలు స్వయం ఉత్పత్తితో ఆర్థికాభివృద్ధి చెందాలని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో సిసిలు, యానిమేటర్లు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం పై మహిళలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీతో 90 శాతం రుణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. మహిళలు స్వయంగా మామిడి, మిరప, పసుపు, పాలు, చేపలు, పుట్టగొడుగులతో ఉత్పత్తులను తయారు చేసి స్వయంగా జీవనోపాధిని పొందవచ్చని సూచించారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తారని, ఫుడ్ ప్రాసెసింగ్ ఆధునిక సాంకేతిక వ్యాపారాన్ని ప్రారంభించి అభివృద్ధి చెందవచ్చన్నారు. కేవలం పది శాతం మాత్రమే పెట్టుబడి పెడితే 90 శాతం బ్యాంకులు రుణ సౌకర్యాన్ని కల్పిస్తాయని చెప్పారు. ఆధార్, పాన్‌కార్డు, కరెంట్‌బిల్లు, ఆరు నెలల బ్యాంక్ స్టేట్మెంట్, కొనుగోలు చేసిన మిషన్ కొటేషన్‌ను తెచ్చుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలి పారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం శ్రీనివాసులు, ఎపిఒ గంగార్జున, సిసిలు ఓబులేసు, శంకర్‌నాయక్, సిద్దయ్య, గంగాధర్, ఫుడ్ కమిటీ కో-ఆర్డి నేటర్ మహేష్, మహిళలు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డుపై ఉన్న నీటిని తొలగిస్తున్న సిబ్బంది

'శాశ్వత పరిష్కారం చూపండి' : డిపిఒ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆదేశాల మేరకు మండల ఇఒపిఆర్‌డి ప్రకాశం, స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్లపై ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే ప్రజాశక్తి దినపత్రికలో 'అధికారుల నిర్లక్ష్యం..ప్రజల పాలిట శాపం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఇఒపిఆర్‌డి ప్రకాశం మాట్లాడుతూ సిమెంట్ రోడ్డుపై ఉన్న నీటిని తరలించడం జరిగిందని, రోడ్డు తగ్గులో ఉండటం వల్ల రోడ్లపై నీరు నిలబడుతుందని చెప్పారు. ఈ రోడ్డు ఆర్అండ్‌బికి సంబంధించిందని, ఎఇతో కూడా చర్చించామని, ఆయన ఎస్టిమేట్ కూడా తయారు చేశారని తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లా డుతూ తాత్కాలిక ఊరట కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, వర్షం వచ్చినప్పుడు నీరు నిలబడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డిపిఒకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి విదార్థీ ఇష్టపడి చదవాలి

రామాపురం : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని అప్పుడే ఉజ్వల భవిష్యత్తు దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట దర్బార్ సాయివిద్యామందిరంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. దర్గాలోని సాయివిద్యా మందిర్ దర్గా స్వామిజీ, మాతాజీ సమాధుల వద్ద పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం, తరగతిగదులు దాతల సహకారం అన్ని రకాల మౌలిక వసతులతో ఉన్న ఈ పాఠశా లలో విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణతా శాతం పెంచాలన్నారు.

లోకేష్‌ను కలిసిన కెకెచౌదరి

ప్రజాశక్తి -చిట్వేలు

యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు చేరుకున్న సంద ర్భంగా నారాలోకేష్‌ను రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు, చిట్వేలి మండలా ధ్యక్షులు కెకె. చౌదరి కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన సమర శంఖం పూరిస్తూ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 400 రోజులు 4000 కిలోమీటర్ల లక్ష్యంతో చేపట్టిన యువగళం పాదయాత్ర చేపట్టారని అన్నారు. పాదయాత్ర రూట్ కో-ఆర్డినేషన్ కమిటీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పాదయాత్రలో కర్షకులు, కార్మికులు, మహిళలు, యువత, బిసి, ఎస్‌సి, మైనార్టీ వర్గాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నూతనోత్సాహాన్ని నింపారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని అన్నారు. సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యమన్నారు.



లోకేష్‌తో మహాముఖి భేటీలో కెకెచౌదరి

ప్రగతి పథంలో వైసిపి పాలన : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ప్రగతిపథంవైపుకు పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఎర్రగుంటపల్లి పంచాయతీలోని ముదుపులవేములవారిపల్లి, దేవాంధ్లపల్లి, ఇక్కిరాలవారిపల్లి, బసిరెడ్డిగారిపల్లి, చిన్నపల్లి, కురవపల్లి, చేనేతనగర్ లో పర్యటించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ద్వారా ప్రజలు పొందిన లబ్ధి వివరాలను ఇంటింటికి వెళ్లి తెలిపారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలు ఉండరాదని భావించి, ప్రతి కుటుంబానికి జగనన్న గృహాలను మంజూరు చేయడం జరుగుతోందని అన్నారు. గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించి, ప్రతి గ్రామ సచివాలయంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీమోహన్‌రెడ్డి, ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి, డిటి సుబ్రమణ్యం, మండల స్థాయి అధికారులు, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, ఎర్రగుంటపల్లి, సర్పంచులు చంద్రారెడ్డి, డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గడపగడపకు కార్యక్రమంలోఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని గుడిబండ పంచాయతీ, యర్రయ్యగారిపల్లి పంచాయతీలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పాల్గొన్నారు. 11 రకాల ధ్రువపత్రాలను పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బరకం రవికుమార్ రెడ్డి, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, డిటి చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, యర్రయ్యగారిపల్లి సెక్రటరీ, గుడిబండ సెక్రెటరీ బాలకృష్ణ, యర్రయ్యగారిపల్లి ఎంపిటిసి, సచివాల కన్వీనర్లు ,సచివాల సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. అర్హులైన లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఇఒపిఆర్‌డి పట్నాయక్, పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయభాస్కర్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్‌అమీర్, వ్యవసాయశాఖ జిల్లా సలహామండలి సభ్యులు రవీరాజ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలోని నిలకంఠరావు పేట గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రామసుబ్బారెడ్డి ఆయుబ్, బాబు, సహదేవరెడ్డి, ఇంతియాజ్, జాకిర్‌హుసేన్, రషీద్, మహేష్, శ్రీనివాసులు, దర్బర్, అబ్దుల్ పంచాయతీ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. **సుండుపల్లె :** గురువారం జి.రెడ్డివారిపల్లి పంచాయతీలో సచివాలయ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎంపిపి రాజమ్మ, జడ్‌పిటిసి ఇస్మాయిల్ డిప్యూటీ తహశీల్దార్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** తిప్పాయపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి పాల్గొని అర్హులైన లబ్దిదారులకు ధ్రువపత్రాలను అందించారు. కార్య క్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి గారు, తాసిల్దార్ నసిం హకుమార్, ఎంపిడిఒ రఘురాం, డిటి ప్రసన్న కుమారి, ఆర్ఐ నవీన్, విద్యుత్‌శాఖ ఎఇ కుమార్, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, ఉపసర్పంచ్ తోట మహేంద్రరెడ్డి పాల్గొన్నారు. **కలికిరి :** గుట్ట పాలెం సచివాలయం భాగ్యలత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ వెంకటరెడ్డి, సాగర్ బ్యాంకు డైరెక్టర్ నల్లారి తిమ్మారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా చూడటం, వారితో పాటు రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అక్కడికక్కడే పరిష్కరించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీకాంత్‌యాదవ్, జడ్‌పిటిసి పద్మజ, లోకవర్ధని, మండల కన్వీనర్ రమేష్‌రెడ్డి, నాయకులు ద్వారక నాథ్‌రెడ్డి,వాలంటీర్లు పాల్గొన్నారు.



మల్లయ్య కొండపై టిఎన్ కుటుంబసభ్యులు

మల్లయ్య కొండను సందర్శించిన టిఎన్ కుటుంబీకులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని స్థానిక టిఎన్ కుటుంబీకులు గురువారం సందర్శించారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి కుమార్తె టిఎన్.అమరావతమ్మ తనయుడు మాజీ సర్పంచ్ టిఎన్. అభిరామ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షురాలు టిఎన్ ప్రమీలమ్మ, కుటుంబ సభ్యులు మల్లయ్య కొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప మల్లి కార్జునలో వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వ హించారు. స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందిచారు. అనంతరం గౌరమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, కృషి ఫలితంగానే కొండకు రోడ్డు సౌకర్యం, ఆలయ పునర్నిర్మాణం చేయడం పై హర్షం వ్యక్తం చేశారు.

అమరనాథ్‌రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కలికిరి

మాజీ మంత్రి కీ.శే.నల్లారి అమరనాథరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన 37వ వర్ధంతి సందర్భంగా నగిరిపల్లిలోని ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలికిరి మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలు వేసి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకు న్నారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నల్లారి అమరనాథరెడ్డి పీలేరు నియోజక వర్గం నుంచి ఎన్నో పర్యాయాలు గెలు పొంది ఎమ్మెల్యేగా, మార్కెటింగ్ గిడ్డంగులశాఖ మంత్రిగా పనిచేసి ఆ శాఖలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. కార్య క్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వాసనూరు చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసి జనార్ధన్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పీలేరు నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు అగస్తేశ్వర్, ఎస్‌టి సెల్ నాయకులు శ్రీనివాస్‌వర్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెవికె కిట్స్ తీసుకున్న విద్యార్థులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-గాలివీడు

జగనన్న విద్యాకానుక తీసుకున్న విద్యార్థులచే తప్పనిగా ఇకెవైసి చేయించాలని ఎంఇఒ పిల్లినాగరాజు పేర్కొన్నారు. గురువారం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4717 మంది విద్యార్థులు ఉండగా 4008 మందికి జెవివి కిట్స్ పంపిణీ చేశామని తెలిపారు. ఇంతవరకు జెవివి కిట్స్ తీసుకున్న 709 మందికి ఇకెవైసి చేయలేదని అన్నారు. బడిబయట పిల్లలను కూడా గుర్తించాలని అడ్మిషన్ రిజిస్టర్‌లో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుపిఆర్‌డి శేఖర్‌నాయక్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరాజు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టైగర్ దోమ కాటు ప్రాణాంతకం

ప్రజాశక్తి-పీలేరు

విష జ్వరాల్లో డెంగీ ఒకటని, ప్రాణాంతకమైన ఈ జ్వరం టైగర్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని డాక్టర్ రమేష్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. గురువారం తలుపుల గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో వారు మాట్లాడుతూ, ప్రత్యేకమైన పరీక్షలు చేస్తే తప్ప డెంగీ జ్వరాన్ని గుర్తించలేమని, జ్వరం ఏదైనా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళి రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమలు నిల్వ ఉన్న నీటిలో మాత్రమే పెరుగుతుందని తెలియజేశారు. ఒళ్ళు, తల నొప్పి, నీరసం, ఆయాసం, కళ్ళు తిరగడం, శరీరంపై మచ్చలు డెంగీ జ్వరం ప్రధాన లక్షణాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రక్తహీనత ఉన్నవారు, గర్భిణులు, మధుమేహం ఉన్నవారు, చిన్నపిల్లలకు ఈ దోమకాటు ప్రాణాంతకమని చెప్పారు. ప్రతి ఫ్రైడేని డ్రై డేగా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నాగవేణి, సిహెచ్ఒ కుముదా, సిసి నరసింహులు, ఆశ కార్యకర్తలు సుజాత, మాహిళా సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

తన భూమిని ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ పాత్రికేయుడు జైనులాబుద్దీన్ బాషాకు అధికారులను కోరారు. గురువారం ఆయన తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎజి గార్డెన్‌లో 2010లో పాత్రికేయులకు ప్రభుత్వం ప్లాట్‌లను మంజూరు చేసిందన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అయిన తరువాత రాయచోటి పట్టణంలో ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను పడిందన్నారు. తనకు ప్లాట్ నెం 632ను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారని అన్నారు. తన మంజూరైన స్థలాన్ని కొంత మంది కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్ళగా తగు న్యాయం చేస్తామని హామీనిచ్చారని అన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఇంటర్వ్యూలో 'మిట్స్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి విభాగానికి చెందిన నలుగురు విద్యార్థులు సర్వీస్ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూలలో ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ ఇంటర్వ్యూ లు తిరుపతి లోని ఎన్‌సిసి హెడ్‌క్వార్టర్స్‌లో గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ యోగేష్ డుంగ్రకోటి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. పి.కార్తీక్, ఎస్.లోకేష్, వసుంధర, ఎం.లోహితరెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. ఆగష్టులో సికింద్రబాద్‌లో జరిగే సర్వీస్ సెలక్షన్ బోర్డు కోచింగ్ క్యాంపులో పది రోజులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్లలు అభినందించారు.

ఐటిఐలో దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీ టిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో రెండవ విడత అడ్మిషన్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టిఒ నాగరాజు తెలిపారు. ట్విట్టర్, ఎలక్ట్రిషన్, సివిల్ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు పదోతరగతి, ఇంటర్మీడియట్ పాస్ లేక ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అభ్యర్థి పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆగస్టు నెల మూడో తేదీ లోపు ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులకు మాత్రమే అడ్మిషన్ పొందే అర్హత ఉంటుందన్నారు.

ఎంపీ నిధులతో సిసి రోడ్లు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మురెవండ్లపల్లిపల్లి గ్రామపంచాయతీలోని మూరెవాండ్లపల్లిలో ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో రూ.15 లక్షలతో సిసి రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు కొన్నేళ్లుగా సిసి రోడ్లు లేక మురికి నీటితో బాధపడుతున్న విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుక పోగా తక్షణం స్పందించి నిధులను మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో మైనార్టీ యువ నాయకులు వేంపల్లి బావాజీ, గ్రామ కన్వీనర్ వీరభద్రయ్య, నాయకుడు రఘు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వేలూరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ గ్రామ వాలంటీర్ల వ్యవస్థ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో గ్రామ వాలంటీర్లు నిరసనకు దిగారు. పవన్ దిష్టిబొమ్మను నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. వైఎస్ఆర్ సర్కిల్లో దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్లు మాట్లాడుతూ సేవా భావంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సభము కాదన్నారు. వెంటనే గ్రామ వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చైర్మన్ కెఆర్ మల్‌రెడ్డి, వైస్ ఎంపిపి కరీం, నాయకుల శివారెడ్డి, రామ్మూర్తి గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మైనార్టీలకు పెద్దపీట

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తోందని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపినట్లు రాయచోటి సమన్వయ కమిటీ సమన్వయకర్త ఎస్ అల్లా బకాష్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోవు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో మైనార్టీలకు స్థానం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఖదీర్, ఆర్‌టిఐ చైర్మన్ అమీర్‌బాషా, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాజుద్దీన్, పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్లాబకాష్



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి

వైస్ ఎంపిపిగా యధుభూషణ్‌రెడ్డి ఏకగ్రీవం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో మొదటి వైస్ ఎంపిపిగా మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిటిసి సభ్యులచే ఎన్నికల అధికారి బాలమునయ్య ఆధ్వర్యంలో ఆయన ప్రమాణస్వీకారం చేసి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి, జడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, ఎఒ జాబిర్‌అహ్మద్‌లు యధు భూషణ్‌రెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవుల నాగ భూషణ్‌రెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, వెంక టయ్య, సూరిబాబు, గంగాధర్‌నాయుడు, కూరగాయల సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చెన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న ఎఒ మురళీధర్

వేరుశనగలో దిగుబడి పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి-గాలివీడు

వేరుశనగ పంటలో సాగు ఖర్చులను తగ్గించి దిగుబడి పెంచడమే పొలంబడి శిక్షణ ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి మండెం మురళీధర్ పేర్కొన్నారు. గురువారం గోపనపల్లి పంచాయతీలో పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు విత్తనశుద్ధి పాటించాలన్నారు. సస్యరక్షణ చర్యలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించుకోవచ్చని సూచించారు. పురుగుల మందులు వాడటం వలన మానవునిలో కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఒలు, పకృతి వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చమర్తి జగన్మోహన్‌రాజును సన్మానిస్తున్న షోరూమ్ యాజమాన్యం

నూతన షోరూమ్ ప్రారంభోత్సవంలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలని సాయి ఆటో మొబైల్స్ యాజమాన్యం పతకమూరి సోదరులు రవికుమార్, సుబ్రహ్మణ్యం చౌదరి ఆహ్వానం మేరకు బైక్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కల్లుగీత కార్మిక డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, ఒంటిమిట్ట యువనాయకులు హరినాథ్‌రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, శేషారెడ్డి పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కొండమారిపల్లి పంచాయతీ బోడిమల్లదిన్నె గ్రామానికి చెందిన రైతు నారం రాజశేఖర్‌రెడ్డి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుకు జరిగిన అన్యాయం ఏ రైతుకు జరగకూడదని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, రూ.50 లక్షలు వారి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చేయాలని తెలిపారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరి, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి పదవ తరగతిలో 12 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించారు. అందులో ట్రిపుల్‌ఐటికి ముగ్గురు దరఖాస్తు చేసుకోగా షేక్ నజ్రిన్ ఎంపికైనట్లు బాలికలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరాజు పేర్కొన్నారు. ప్రతి ఏడాది బాలికల ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్‌ఐటి ఎంపిక అవుతున్నారని చెప్పారు. ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు ఫైరోస్, నిర్మల, రమణయ్యలు అభినందించారు. **నిమ్మనపల్లి :** ట్రిపుల్‌ఐటి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీ ఖాన్ తెలిపారు. ఉత్తీర్ణులైన నిహారిక, ప్రతిభ, నీతూ రెడ్డి, శేషాద్రి నలుగురు విద్యార్థులు ఐఐఐటిలో సీట్లను సాధించినట్లు తెలిపారు. ఇడుపులపాయలోని ఐఐఐటికి నిహారిక, ప్రతిభ, నీతూ రెడ్డి ఎంపిక కాగా, శ్రీకాకుళంలోని ఐఐఐటికి శేషాద్రి ఎంపికయ్యారని తెలిపారు. త్రిబుల్ ఐటీ లో సీట్లను సాధించి తమ పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం కార్నర్

ఎర్రచందనం స్మగ్లర్లు పరారీ

ప్రజాశక్తి-పెద్దమండెం

పెద్దమండెంలో బుధవారం రాత్రి తమిళనాడు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు పోలీసులు వెంబడించడంతో చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. ఎస్ఐ రామాంజనేయుడు వివరాలమేరకు.. గుర్రంకొండ నుంచి పెద్దమండెం వైపుకు కారులో ఎర్రచందనం స్మగ్లర్లు వస్తున్నటు సమాచారం అందిందన్నారు. వారిని వెంబడించి ప్రయత్నించగా కారు డోర్‌లు ఒపెన్ చేసుకొని చాకచక్యంగా పారిపోయారని చెప్పారు. వారి ఆచూకీ కోసం పెద్దమండెం, గాలివీడు, గుర్రంకొండ, పోలీసులు నాలుగు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందించి అప్ర మత్తం గా ఉండాలని సూచించామన్నారు. స్మగ్లర్లు వినియోగించిన కారును, అందులో ఉన్న కొడవళ్ళు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్మగర్ల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేస్తామని ఎస్ఐ వెల్లడించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు



దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న కిర్లోస్కర్ గ్రీన్ పవర్ జనరేటర్ కోసం కెనోపి అండ్ బేస్ ఫ్రేమ్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ చేసేందుకు ఆసక్తి గల సరఫరా దారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరేటర్ల సరఫరా, ఇన్‌స్టాలేషన్ ఫీల్డ్‌లో అర్హతలు, అనుభవం కలిగిన వారు ఈనెల 15న సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో సీల్డు కొటేషన్లను సమర్పించాలని తెలిపారు. టెండర్లకు సంబంధించి పూర్తి వివరాల కోసం జిల్లా ప్రధాన కోర్టు కడప వెబ్ సైట్ districts.ecourts.gov.in/kadapa, లేదా 08562-254963లో సంప్రదించాలన్నారు. టెండరు నిర్వహణ ప్రక్రియ నిబంధనలు, షరతులకు లోబడి జరుగుతుందని తెలిపారు.

శ్రీఎం సేవలు ఆదర్శనీయం

సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ్య ఆస్పత్రి ప్రారంభంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యం అందించడంలో పద్మభూషణ్, సత్సంగ్ ఫౌండర్ శ్రీఎం (ముంతాజ్ అలి) ఆదర్శనీయమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. పట్టణంలోని నక్కలదిన్నెలో సంస్థ ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరిలో అప్పటి భారత రాష్ట్రపతి రామ్ నాథ్‌కోవింద్ శంకుస్థాపన చేసిన 50 పడకల మల్టీ స్పెషాలిటీ స్వస్త్య ఆసుపత్రిని నితిన్ గడ్కరి గురువారం ప్రారంభించారు. ముందుగా బిటీ కళాశాల మైదానానికి చేరుకున్న ఆయనకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రాజు, కలెక్టర్ గిరిష పిఎస్, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాష, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ మనోజా రెడ్డి, జడ్పిటిసి ఉదయ్ కుమార్, మదనపల్లి ఆర్డీవో మురళి స్వాగతం పలికారు. అనంతరం సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వస్త్య ఆస్పత్రి ప్రాంగణానికి చేరకుని ప్రారంభించారు. ఆస్పత్రిలోని విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీ ఎం ఆధ్యాత్మిక వేత్త మాత్రమే కాకుండా సంఘసంస్కర్త అని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. కోవిడ్ - 19 సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని మదనపల్లిలో ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని సంకల్పిం చారు. ఈ ఆసుపత్రిని ఇప్పుడే సందర్శించానని, ఇందులో అన్ని రకాల సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. మదనపల్లె దగ్గర ఉన్న జాతీయ రహదారులపై ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే వారికి అత్యవసర సేవలు అందించడానికి స్వస్త్య ఆసుపత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. శ్రీ ఎం మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తలమానికంగా, పేదలకు అందుబాటులో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 24 ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి బిజెపి రాజంపేట పార్లమెంటు జిల్లా ప్రెసిడెంట్, ఎం.పార్థసారథి కదిరి మాజీ ఎమ్మెల్యే, ఏ.మంగరాజు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తంబళ్లపల్లె, నాగరెడ్డెమ్మ రాష్ట్ర బిజెపి ఇసి సభ్యులు కె.అంజనమ్మ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు కె. రవీంద్ర రాష్ట్ర గిరిజన మోర్చా సెక్రటరీ ఎం.వేణుగోపాల్ రాష్ట్ర ఓబిసి మోర్చా ఈసీ మెంబర్, శంకర్ మూర్తి బిజెపి టౌన్ ప్రెసిడెంట్, సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ


అక్రమ బదిలీలు రద్దు చేయాల్సిందే : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

సాధారణ బదిలీల అనంతరం బ్లాక్ చేసిన పోస్టులలో ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అక్రమ బదిలీలు చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఆలయం ఎదుట అక్రమ బదిలీలను ఆపాలని, బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో దొడ్డిదారి బదిలీలు అధికమయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల 15 మందికి ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు వచ్చాయని, మరి కొంతమంది ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సామాన్య ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. మారుమూల పనిచేసే ఉపాధ్యాయులు సర్వీస్ మొత్తం మారుమూల ప్రాంతాల్లోనే పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న విధానాలను పాలకులు తుంగలో తొక్కి వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ సమస్యల వల్ల జీతాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీనిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల వల్ల దాదాపు 40 శాతం మంది ఉపాధ్యాయులు ఈనెల జీతాలు అందుకోలేకపోయారని తెలిపారు పిజిటిలుగా వెళ్లిన స్కూల్ అసిస్టెంట్లు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూస్తున్నారని, డిఇఓ పూల్‌లో ఉన్న ఎల్పిలకు కూడా జీతాలు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా మారిన పాఠశాలలకు డిడిఓ కోడ్స్ లేని కారణంగా వారికి జీతాలు ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులను తొలగించిన కారణంగా ఆ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కూడా జీతాలు చెల్లించే మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు మరింత తీవ్ర స్థాయిలో జరిపి ప్రభుత్వం మెడలు వంచైనా సాధించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, నాయకులు గోపీనాథ్, కిరణ్ కుమార్, డేవిడ్, అబ్దుల్ గనీ, జావిద్, శ్రీనివాసులు, కరిముల్లా, సుబ్బారావు, సిద్దయ్య, అనిల్, సునీల్ కుమార్, కిరణ్ కుమార్, వనమాల రాము, ఓబులేసు, గురు మోహన్, రాజశేఖర్, కత్తి రామాంజనేయులు, సుబ్బారెడ్డి, సూర్యకుమార్, గణేష్ బాబు పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



సమావేశంలో మాట్లాడుత్ను డివైఎఫ్ఐ నాయకులు ముడియం చిన్ని

గ్రూప్ -2 నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ - 2 నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, అభ్యర్థుల వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పోస్టులు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాయని వాటిని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకుండా కాలయాపన చేయడం సరైంది కాదని వాపోయారు. నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సచివాలయాలలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటికి ఇప్పటివరకు నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 45 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, లైబ్రరీ సైన్స్ పోస్టులు 6 వేలు, సచివాలయాలలో దాదాపు 8 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో 2.43 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని వారు గుర్తు చేశారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎదురుచూస్తున్న పోస్టులన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భర్తీ చేసి వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు పి సురేంద్ర, లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.

నెల్లూరు జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వై.ఎస్. రాజారెడ్డి ఎ సి ఎ స్టేడియంలో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై 5 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 222 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 366 పరుగులు చేసింది. చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 75.3 ఓవర్లలో 200 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఆర్ ప్రనిల్ రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించాడు. 180 బంతులను ఎదుర్కొని 19 బౌండరీలు సహాయంతో 113 పరుగులు (సెంచరీ) చేశాడు. నెల్లూరు జట్టులోని పి. సుతేజ్ రెడ్డి 3, కె. సృజన్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇంగింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 13.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని మన్విత్ 29 పరుగులు చేశాడు.

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 6 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్ లో చిత్తూరు జట్టు 191 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 253 పరుగులు చేసింది. ఏడు వికెట్ల నష్టానికి 201 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు తన రెండవ ఇన్నింగ్స్ లో 66.0 ఓవర్లలో 207 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతపురం జట్టులోని టీ. ప్రదీప్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. లీలా సాయి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 16.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని పి అర్జున్ టెండూల్కర్ 97 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని ముఖేష్ 3 వికెట్లు తీసుకున్నాడు.



తలపడుతున్న కడప, నెల్లూరు జట్లు

సంక్షేమ పథకాలే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పోరుమామిళ్ళ టౌన్

ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారుడు పి. నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అక్కల రెడ్డిపల్లిలో జగనన్నసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత 2019 నుండి 2023 వరకు సంక్షేమ క్యాలెండర్‌లో ఉన్నట్లు అన్ని పథకాలు ప్రజలకు అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థలో 540 రకాల సేవలను తీసుకొచ్చారని చెప్పాపరు. అక్కలరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో భూములు ఆన్‌లైన్ కావడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు తహశీల్దార్ స్పందిస్తూ ప్రతి రైతుకు సంబంధించిన భూములను త్వరలో ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, ఉప ఎంపిపి బాష, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలోని బ్రాహ్మణపల్లెలో గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులై అందకపోతే తక్షణమే వారికి సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్ రెడ్డి, ఎంపిడిఒ మహబూబ్‌బీ, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, జెఎస్‌సి మండల కన్వీనర్ చిత్త రాజశేఖర్ రెడ్డి, రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి అధ్యక్షులు నిర్మలా నారాయణ మండల ఉపాధ్యక్షులు అన్నా రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, జడ్‌పిటిసి అంకన్నగురివిరెడ్డి, కొత్తకోట సహకార సంఘ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, లిప్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శనం, వైసిపి నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజలు పాల్గొన్నారు **చెన్నూరు :** జగనన్న సురక్ష కార్యక్రమం చెన్నూరు గ్రామ సచివాలయం-2లో గురువారం నిర్వహించారు. లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు సచివాలయంలో ఎటువంటి రుసుము లేకుండా కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇన్ని రకాల పథకాలు, సేవలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. ఆ ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఘనత దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజనేయులు, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్జిని భాస్కర్ రెడ్డి, పవన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ సలహాదారుడు ఎర్ర సాని మోహన్ రెడ్డి, చెన్నూరు సర్పంచ్ వెంకట సుబ్బయ్య, కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్, పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, రెండవ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **వల్లూరు :** ప్రజలందరూ జగనన్నసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కొట్లూరు పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు సేవలందించడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు కుల, ఆదాయ ,జనన ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకొని ఉచితంగా పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్రావు, ఎంపీడీవో జుబేదా, మాజీ జడ్‌పిటిసి అబ్బిరెడ్డి వీరారెడ్డి, మండల అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బుగ్గలపల్లిలో హెల్త్ వెల్నెస్ సెంటర్, అంగన్వాడీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య విషయంలో సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరాతీశారు. గర్భిణులకు ఐరన్ టాబ్లెట్లు ఇస్తున్నారా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పిల్లలకు ఆరోగ్యం, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వారి వెంట డాక్టర్ లక్ష్మీకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాఘవేంద్ర, సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, ఎఎన్ఎం, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలు బంద్

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ 22 ప్రకారం ఏపీహెచ్ఇఆర్ఎంసి ఫీజుల నిర్ణయం చాలా బాధాకరమని, దీనికి నిరసనగా శుక్రవారం డిగ్రీ కళాశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ ఈజీ మెంబర్ సుబ్బారెడ్డి, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్‌కెజి పిల్లలకి రూ.20 వేలు తీసుకుంటుంటే , డిగ్రీ విద్యార్థులకు గత సంవత్సరం కంటే ఫీజు తగ్గించి తీసుకున్న నిర్ణయం విచారకరమని తెలిపారు. ఏ ప్రాతిపదికన ఫీజులు నిర్ణయించారో తెలపాలని పేర్కొన్నారు. ఫీజు తగ్గింపునకు నిరసనగా రాష్ట్ర డిగ్రీ కళాశాలల బంద్‌నకు మద్దతుగా, జిల్లా డిగ్రీ కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ ప్రకటిస్తున్నామని తెలిపారు. **నేటి డిగ్రీ పరీక్ష వాయిదా :** వైవీయూ పరిధిలో ఈనెల 14న జరగాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా వేస్తున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన కారణంగా పరీక్షను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వాయిదా పడ్డ పరీక్ష ఈ నెల 21 తేదీన నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఎ.వి.రమణయ్య సేవలు మరువలేనివి

బద్వేలు : చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన బదిలీలలో పోరుమామిళ్ల మండలం టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలక్కు వెళ్లిన ఎ.వి.రమణయ్య సేవలు మరువలేనివని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. గురువారం ఎ.వి. రమణయ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. ఉమాకాంత్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో ఎ.వి.రమణయ్య సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. స్టాఫ్ సెక్రటరీ మాదన విజయ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణకు రెండు సంవత్సరాల కాలం మాత్రమే ఉన్న సమయంలో ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ వల్ల ప్రధానోపాధ్యాయులు ఎ.వి. రమణయ్య తప్పనిసరి బదిలీ జరగటం బాధాకరమన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోపమ్మ, ఉపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, టి.పెంచలయ్య, ఆర్.వెంకటసుబ్బయ్య, టి.వి.సుబ్బారావు, పి.సుబ్బరాయుడు, ఎస్.వరలక్ష్మి, ఎస్.గౌస్ బాషా, వై.రామ్మోహన్ పాల్గొన్నారు.

బీడీలు చుట్టడానికి రూ.500 ఇవ్వాలి

కడప అర్బన్ : బీడీ కార్మికులకు 1000 బీడీలు చుట్టడానికి రూ.500 ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి కోరారు. గురువారం నెల్లూరు జిల్లాలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు గుర్తింపు కార్డు, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అతి తక్కువ వేతనాలతో బీడీలు చుడుతూ యజమానులకు ఎక్కువ లాభాలు సంపాదించి పెడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీడీ కార్మికులు ఎక్కువగా రాయలసీమ జిల్లాలలోని తాడిపత్రి, కదిరి, అమరాపురం, రాయచోటి, కమలాపురం, కడప, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాలంతో పాటు నెల్లూరు, బాపట్ల జిల్లా వేటపాళ్యం, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో పనిచేస్తున్నారని చెప్పారు. మైనార్టీ, దళిత వర్గాలకు చెందిన మహిళలు బీడిరంగంలో 30 వేల మంది రాష్ట్రంలో పనిచేస్తున్నారని చెప్పారు. వీరందరూ ఇళ్లల్లో ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులకు సంఘం, ఐక్యత , సంఘటిక శక్తి లేకపోవడం వల్ల ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకుని రాలేక పోతున్నారని చెప్పారు. బీడీ కార్మికులు సంఘటితమయ్యేందుకు సంఘం ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. బీడీ కార్మికులందురూ సంఘంలో సభ్యులుగా చేరాలని కోరారు.

కెమికల్ ఫ్యాక్టరీలపై చర్యలు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

ఇఎస్ఐ, పిఎఫ్ కట్టని కెమికల్ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప నగర పరిధిలో ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గరలో గల మొత్తం కెమికల్ ఫ్యాక్టరీలలో కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ కట్టడం లేదని అన్నారు. అధికారులు మామూళ్ల మత్తులో తూలుతూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గరలో మొత్తం ఇంచుమించు 15 కెమికల్ ఫ్యాక్టరీలుంటే ఏ ఒక్క కెమికల్ ఫ్యాక్టరీలోనూ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ లు చెల్లించడం లేదన్నారు. కొన్ని వాటికైతే కనీసం ఫైర్ సేఫ్టీలు కూడా లేవన్నారు. కనీస వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి అక్కడ లేదని వాపోయారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ తనిఖీలు చేసిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని వారికి ఇఎస్ఐ, పిఎఫ్ లు చెల్లించేలా చూడాలని కోరుతున్నామన్నారు. s అధికారులు చర్యలు తీసుకోకపోతే అటువంటి అధికారుల కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, ఫారుక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు పుల్లయ్య



ఫోన్‌లో వినియోగదారుల సమస్యలు వింటున్న ఎస్ఇ రమణ

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' కార్యక్రమం ద్వారా కడప, ఖాజీపేట, సింహాద్రిపురం, ప్రొద్దుటూరు, చింతకొమ్మదిన్నె, బద్వేల్ తదితర ప్రాంతాల నుండి విద్యుత్ వినియోగదారులు వివిధ రకాల విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించి, సరఫరాలో అంతరాయం వంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటిని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పరిశీలించిన అనంతరం పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. సుబ్రహ్మణ్యం, జీ.వి. సుబ్బారావు, జెఇ ఎన్. లావణ్య పాల్గొన్నారు.

పోరాటాలే శరణ్యం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణంలో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని వాపోయారు. విద్యావ్యవస్థలో రోజుకో జీవో తీసుకొస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించకుండా, వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని వాపోయారు.పాఠశాలల విలీనం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ,పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్ముతూ విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు భైరప్రసాద్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుమంత్, సందీప్, అర్జున్, వంశీ, ప్రేమ్, రఫీ, వినయ్, విద్యార్థులు వైష్ణవి, మానస, షమీన, రమాదేవి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - కడప

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం కడపలోని కొండాయపల్లి మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో బాలికలకు ఆహావగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త బి. వినోద్ కుమార్ మాట్లాడుతూ మంచి స్పర్శ, చెడు స్పర్శ, మంచి ఆహారపు అలవాట్లు, శుభ్రత పరిశుభ్రత, రక్షణ పరమైన సమస్యలు ఎదురైనప్పుడు ఎవరిని సంప్రదించాలి అనే విషయాల పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాలల కు ఇష్టమైన యానిమేషన్ రూపం లో ఉన్నటువంటి తెలుగు అనువాదం లో కోమల్ వీడియోను ప్రదర్శించారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి కె. సరిత కుమారి మాట్లాడుతూ బాల బాలికలుకు రక్షణగా తాను ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తెలియజేయాలి అని తెలిపారు. బాల బాలికల సాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1098 కాల్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. కార్యక్రమం లో ప్రదానోపాధ్యాయులు పి.సి చెన్నయ్య, ఎడ్యుకేషనల్ సెక్రటరీ కె. చంద్రశేఖర్, శిశుగృహ సామాజిక కార్యకర్త బి. పద్మిని, బాలికలు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఉద్యమ పోరాటల్లో నగర కమిటీ సభ్యులు ముందుండాలని పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వారి కార్యాలయంలో ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్స్ యూనియన్ నగర ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మునిసిపల్ పాఠశాలలలో చాలా చోట్ల ఇస్కాన్ సంస్థ ద్వారా స్కూల్ పిల్లలకు అందిస్తున్న జగనన్న గోరుముద్దలో మెనూ అమలు కాలేదన్నారు. దీనికారణంగా సగానికి పైగా పిల్లలు ఇంటివద్ద నుంచి క్యారీలు తెచ్చుకుంటున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలలో నాడు - నేడు పనులు పూర్తికాక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. భవిష్యత్ లో నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై రాజిలేని పోరాటలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కడప నగర కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా ప్రేమ్ కుమార్, కార్యదర్శి గా నరసింహ, ఉపాధ్యక్షులుగా తరుణ్, కేశవ, ఆకాష్, సహాయకార్యదర్సులుగా భాగ్యరాజు, నాని సభ్యులుగా. నాగరాజు, గౌతమ్, వినోదకుమార్, ఓబుళయ్యలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట


శాస్త్రవేత్తల నుంచి బహుమతి అందుకుంటున్న రైతు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులు విత్తనశుద్ధిని తప్పక పాటించాలని, తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించడంతోపాటు తెగుళ్ల నుంచి బయట పడవచ్చని మండల వ్యవసాయ అధికారి నాగార్జున సూచించారు. పత్తూరులో గురువారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏరువాక కేంద్రం అధికారి డాక్టర్ టి.మురళీకృష్ణ మాట్లాడుతూ వరి పంట విత్తుకునే ముందు విత్తనశుద్ధి తప్పక చేయాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ వరి పంటలో వాడదగిన ఎరువులు, కలుపు మందులు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఎపి రాష్ట్రాల ఆర్గానిక్ హెడ్ శ్రీనివాసరావు సేంద్రియ ఎరువుల వాడకం పెంపొందించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఎఒ మాట్లాడుతూ చిరుధాన్యాలపై రైతులు దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త సాయి మహేశ్వరి, కోరమండల్ అధికారులు సుబ్బారెడ్డి, సచిన్ పాల్గొన్నారు. అనంతరం రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఐటిఐకి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - మైలవరం

మైలవరం ప్రభుత్వ ఐటిఐ కాలేజీకి స్థలం కేటాయించి, దాని నిర్మాణం చేపట్టాలని డివైఎఫ్ఐ కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆ మేరకు గురువారం ఆయన డిటికి వినతిపత్రమిచ్చారు.


డిటికి వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మైలవరానికి ఐటిఐ 2015లో అప్పటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కాలేజీ నిర్మాణానికి స్థలం కేటాయించలేదన్నారు. మైలవరం ప్రభుత్వ ఐటిఐ కాలేజీ కూడా జమ్మలమడుగులో ప్రభుత్వఐటిఐ కాలేజీలోనే నిర్వహిస్తున్నారన్నారు. రెండూ ఒకే చోట ఉండడంతో అక్కడ గదులు, ఇతర సౌకర్యాలు సరిపడడంలేదన్నారు. ఈ ప్రాంతానికి ఉక్కు పరిశ్రమ భవిష్యత్‌లో ఏర్పాటైతే ఐటిఐ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మైలవరం కాలేజి నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించిందని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణం జరగలేదన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. డివైఎఫ్ఐ మండల నాయకులు శంకర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె


జె.స్నేహ, ఎన్.చంద్రకళ, బి.మహేశ్వరి

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కెవ్యాలీ ట్రిపుల్‌ఐటీకి వేంపల్లెలోని మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్.హరిత తెలిపారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను ఎన్.చంద్రకళ, బి.మహేశ్వరి, జె.స్నేహ సాధించారన్నారు. వీరు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం ప్రిన్సిపల్ హరిత, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 10మందికి..

ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్‌ఐటీలకు ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నారాయణమ్మ తెలిపారు.


మిఠాయి తినిపిస్తున్న హెచ్‌ఎం నారాయణమ్మ

గురు వారం ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ విడుదల చేసిన అడ్మిషన్ల ఫలితాల్లో చందన, సాహితీ, రూప, మౌనిక, హర్షిత, సాయి సుప్రియ, శ్రీహరిక, ఝాన్సీ, భవ్య ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు తినిపించారు.

ఉషాకిరణ్ పాఠశాల నుంచి..

రాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఆర్‌కెవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు 2023-24 విద్యా సంవత్సరానికి ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు.



గురువారం ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ విడుదల చేసిన అడ్మిషన్ల ఫలితాల్లో తమ విద్యార్థులు శ్రీలక్ష్మి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, బొక్కసం విశ్వతేజ, కంతూరి యశస్విని, ఏటూరు పల్లవి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతో వీరు ఆయా ట్రిపుల్ ఐటీల్లో సీటు పొందినట్లు పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

నగరవనం సేవలు అందుబాటులోకి తేవాలి

పులివెందుల రూరల్ : వచ్చే ఆదివారం నుంచి సిటీ ఫారెస్ట్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సిటీ ఫారెస్ట్‌ను పురపాలక సంఘం చైర్మన్ వరప్రసాద్, అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వనంలోని 15 షాపులను కూడా అందుబాటులోకి తేవాలన్నారు. సిటీ ఫారెస్ట్‌లో మొత్తం పురపాలక సంఘం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేయాలని ఆదేశాలిచ్చారు. నగరవనాన్ని నో స్మోకింగ్ ఏరియాగా తీర్చిదిద్దాలన్నారు. మూడేళ్లలోపు పిల్లలకు ఎలాంటి ప్రవేశ రుసుం ఉండదని తెలిపారు. వాకింగ్, సైక్లింగ్, హార్స్‌రైడింగ్, యోగా, బోటింగ్ వాటికి నెల పాస్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆ వివరాలను ప్రవేశద్వారం వద్ద ప్రదర్శించాలని సూచించారు. అన్ని రుసుములు ఆన్‌లైన్ రూపంలో మాత్రమే స్వీకరిస్తారన్నారు. వీటికి సంబంధించిన ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకొని ఆదివారం నాటికి నగర ప్రజలకు సిటీ ఫారెస్ట్‌ను అందుబాటులోకి వచ్చేలా అధికారులు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి, ఏపీజీబీసీ ఈఈ రమేశ్‌బాబు, కౌన్సిలర్ కిశోర్, డేనియల్ బాబు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి ఏర్పాటు హర్షణీయం

పులివెందుల రూరల్ : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి ఏర్పాటు చేయడం హర్షణీయమని వైఎస్‌ఆర్టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీకే వెంకట్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్‌గా మాజీ ఐఎఎస్ అధికారి మన్మోహన్‌సింగ్‌ను నియమించారని, ఆయన ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణపై నివేదిక రూపొందించి, ప్రభుత్వానికి అందచేస్తాన్నారు. బుధవారం క్యాబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నందుకు

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని కలమల్ల గ్రామంలో శశిరేఖ(30) అనే వివాహిత గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి భర్త గనాంజనేయరెడ్డి మద్యానికి బానిసై కుటుంబాన్ని చూసుకోలేదనే మనస్థాపంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో వంటగదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. శశిరేఖ తల్లి సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

జువారి రస్తాకు మోక్షమెప్పుడో..!

మూడేళ్ల కిందటే టెండర్ పూర్తి - ఉన్న వంతెన రేపోమాపో కూలే పరిస్థితి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పెదనపాడు గ్రామం నుండి జువారి కర్మాగారానికి వెళ్లే రస్తా పూర్తిగా దెబ్బతింది. ఈ రస్తాలో వంక ఉండడంతో వాహనాల రాకపోకలకు సిమెంట్ రోడ్డును నిర్మించారు. ఒక వైపున ఉన్న సిమెంట్ రోడ్డు పూర్తిగా విరిగిపోయింది. ఉన్న ఒకవైపు రోడ్డు కూడా నెర్రెలు చీలి, రోడ్డు కింది భాగాన ఉన్న మట్టి కోతకు గురైంది. దీంతో ఆ వైపు కూడా కూడా పడిపోయే పరిస్థితిలో ఉంది. ఈ రస్తా ద్వారా స్థానిక జువారి సిమెంట్ కర్మాగారానికి, ఆ పరిసర గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. తీవ్ర ప్రమాదకరంగా ఉన్నా సంబంధించిన అధికారులు అక్కడ రోడ్డును క్లోజ్ చేయడం లేదా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. రానున్నది వర్షాకాలం కావడంతో


పూర్తిగా దెబ్బతిన్న కాజ్‌వే

వంక గుండా నీరు ప్రవహిస్తే ఉన్న రోడ్డు కూడా కొట్టుకుపోతుందని, అప్పుడు ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుకు సంబంధించి మూడేళ్ల క్రితమే ఆర్అండ్‌బి అధికారులు టెండర్లు పూర్తి చేశారు. పనులను దాదాపు రూ.40 లక్షలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బంధువులకు చెందిన సంస్థ దక్కించుకుంది. అయినా ఇప్పటివరకు పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ టెండర్ నిర్వహిస్తాం..



వంకపై రోడ్డు నిర్మించుటకు ఒక ప్రైవేట్ సంస్థ టెండర్ ద్వారా పనులను దక్కించుకుంది. కానీ ఆ సంస్థ మూడు ఏళ్లు గడిచినా పనులు మొదలు పెట్టకపోవడంతో కాంట్రాక్టును రద్దు చేశాం. మళ్లీ టెండర్ నిర్వహించేలా ప్రభుత్వానికి నివేదికలు పంపాం. అక్కడి నుండి ఆదేశాలు రాగానే టెండర్ నిర్వహించి, సకాలంలో పనులు పూర్తి చేస్తాం.

- నరసింహారెడ్డి, ఇఇ(ఆర్అండ్‌బి)

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అప్పుల బాధతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. వేంపల్లె ఆసుపత్రిలో రైతు ఎద్దుల సాంబశివారెడ్డి మృతదేశం వద్ద వారు నివాళులర్పించారు. ఆత్మహత్యకు గల కారణాలను సాంబశివారెడ్డి తండ్రి నారాయణరెడ్డిని, బంధువులను అడిగి తెలుసుకున్నారు. అప్పులున్నటికీ రైతులు ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. నారాయణరెడ్డిని ఓదార్చారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, గోగుల మల్లికార్జున, జబిబుల్లా, డక్కా రమేష్, కృష్ణారెడ్డి, పివి రమణ, వెంకటయ్య,


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, బాలస్వామిరెడ్డి, గోటూరు నాగభూషణం, ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో జగన్ ఆదర్శం


కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో ఆదర్శంగా నిలుస్తూ ప్రజల చెంతకే ప్రభుత్వం వెళుతోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చింతర్వాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి సిబ్బందిని గ్రామాల్లోనే అందుబాటులో ఉంచామన్నారు. డికెటి భూములపై సాగుదారులకు సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పేద రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి నేరుగా ఎమ్మెల్యేలు వెళుతున్నారన్నారు. ఇంకా అర్హులకు పథకాలు అందకపోతే వారిని గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. జగనన్న సురక్ష ద్వారా అన్నవరంలో 599 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, తహశీల్దార్ సుభాని, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, ఎఒ రామానుజం, మండల అధికారులు, మండల నాయకులు శేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు పీరయ్య, మునీంద్ర, జైనుల్లా, నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. గురువారం కె.వెలామవారిపల్లి వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు ఆదాయ, వివాహ, జనన వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్నమున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

సిసి కెమెరాలు బాగు చేయాలని వినతి


శంకర్ బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వీరబ్రహ్మంగారి రథశాల షట్టర్, దేవస్థాన ప్రాంగణంలోని సిసి టీవీ కెమెరాలను బాగుచేయాలని గురువారం సిపిఎం నాయకులు మండల కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన పిట్‌పర్సన్ శంకర్ బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ మాట్లాడుతూ బ్రహ్మంగారి రథశాలకు సంబంధించిన షట్టర్ ఊడిపోయి ఏడాది దాటిపోయిందని, రథం ఎండకు, వానకు గురవుతూ, అందులో కుక్కలు, పందులు కోతులు సంచరిస్తున్నాయని తెలిపారు. రథానికి భద్రత లేకుండా పోయిందని వివరించారు. పవిత్రత లేకుండా పోయిందని, భక్తుల మనోభావాలను అధికారులు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. దేవస్థాన ప్రాంగణంలో సిసి టీవీ కెమెరాలు సరిగా పనిచేయడంలేదన్నారు. వివిధ ప్రాంతాల నుండి యాత్రికులు వస్తుంటారన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్, అజయ్‌కుమార్, రాహుల్, అరవింద్, దేవ పాల్గొన్నారు.

పాపాఘ్ని నది నీటిని సరఫరా చేస్తాం

- సర్పంచు రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పాపాఘ్ని నది నుండి నీటిని సరఫరా చేస్తామని సర్పంచు రాచినేని శ్రీనివాసులు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వార్డు సభ్యుల సాధారణ సమావేశం సర్పంచు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాఘ్ని నీటి సరఫరాకు పైపులైన్ పనులు చేయాల్సి ఉందన్నారు. అందుకు నిధులు మంజూరు చేయాలని ఇటీవల సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆ మేరకు సిఎం వేంపల్లె పంచాయతీకి రూ.1కోటి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కరెంటు స్తంభాలకు లైట్లు వేయడంతోపాటు పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని వార్డు సభ్యులు అధికారులను కోరారు. డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయక అయా ప్రాంతాల్లో మురికి నీరు రోడ్లపైన ప్రవహిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా సిబ్బంది సరఫరా చేయడం లేదని వాపోయారు. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువైందని, వాటిని నియంత్రించాలని ఎంపిటిసిలు కోరారు. పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు సహకరించాలని సర్పంచు రాచినేని శ్రీనివాసులు, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులు, వెంకటేష్, బికారి, మణి గోపాల్ రెడ్డి, శ్రీనువాసులు, గణేష్, శశికళ, ఉమర్, ఎంపిటిసిలు రాజ్ కుమార్, కటిక చంద్రశేఖర్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'మొక్కలు నాటడం అందరి బాధ్యత'

- గౌరీదేవి బలిజ సంఘం అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - వేంపల్లె

కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటడడం అనేది అందరి బాధ్యతని గౌరీదేవి బలిజ సంఘం అధ్యక్షులు కుళాయప్ప, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. మొక్కలు విరివిరిగా పెంచడం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పచ్చదనం ప్రతి ఇంటి వద్ద ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు షామీర్, ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని జెసి గణేష్‌కుమార్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం భూముల రీ సర్వే చేపడుతోందన్నారు. మండల పరిధిలో ఇప్పటికే వెంగన్నగారి పల్లె గ్రామం పూర్తయిందని, కొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయన్నారు. సర్వేయర్లు కొలతలు చేపట్టి రైతులకు హద్దులు చూపించి రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, డిటి భవానీ, విఆర్ఒలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం ఎంఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారులు నిరసన వ్యక్తం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సురేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభించి నెలలు గడుస్తూన్న ఇంతవరకు పాఠ్యపుస్తకాల ఇవ్వకపోవడం దారుణమన్నారు. పాఠ్యపుస్తకాలు ఇవ్వకుంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పెట్టేవారని తెలిపారు. వెంటనే జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. భాస్కర్, శివ, వినయ్, శివ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో..

పులివెందుల రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం(ఆర్ఎస్‌వైఎఫ్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ మేరకు గురువారం స్థానిక వైయస్‌విఆర్‌యం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకుడు వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల బాధలు పట్టని వైసిపి, జనసేన

ప్రజాశక్తి - వేంపల్లె

పెళ్లాల గొడవ తప్ప ప్రజల బాధలు, సమస్యలు వైసిపి, జనసేన పార్టీకి పట్టవా అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ప్రశ్నించారు. వేంపల్లెలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు.


మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాజధానిలేని రాష్ట్రంగా మారడంతోపాటు పోలవరం ప్రశార్థకంగా తయారైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవేవీపట్టని వైసిపి, జనసేనలు పెళ్లాల గొడవలు పడడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మిగతా స్థానిక ప్రభుత్వాలకు సమాంతర రాజ్యాంగేతర వ్యవస్థలుగా గ్రామ, వార్డు వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం 73,74 రాజ్యాంగ సవరణ చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గ్రామ, వార్డు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న సురక్ష పథకం పబ్లిసిటీ పథకమని ఎద్దేవా చేశారు. సమావేశంలో సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, రవి, ఉత్తన్న, చెన్నకేశవ పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యునిగా బాలస్వామి ఏకగ్రీవం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం



బ్రహ్మంగారిమఠం మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుగా మాజీ సర్పంచు బాలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. హాజరైన 9 మంది ఎంపిటిసిలు ఏకగ్రీవంగా మద్దిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కో-ఆప్షన్ సభ్యునిగా ఉన్న పుల్లయ్య అనారోగ్యంతో మృతిచెందారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంగమునిరెడ్డి, పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో విజేత చౌటపల్లి ఎద్దు

చాపాడు : చిన్న గురువలూరులో శిరిడి సాయినాథ స్వాముల దేవస్థాన 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లికు చెందిన మార్తాల చంద్రఓబుళరెడ్డి ఎద్దు మొదటి బహుమతి రూ.80వేలు కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించారు. పందెంలో 11 జతల ఎద్దు పాల్గొన్నాయి. స్వామివారికి ఊరేగింపు రథాన్ని గ్రామానికి చెందిన వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రెడ్డి అందించారు. అన్నదానం నిర్వహించారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుబంధం చేయాలి

ప్రజాశక్తి - దువ్వూరు

ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుబంధం చేయాలని ఎపి రెడ్డి సంఘం నాయకులు కోరారు. రెడ్ల ఐక్య చైతన్య యాత్ర గురువారం దువ్వూరు చేరుకుంది. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట సురేష్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా ఆయన వివిధ రంగాల వారిని కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రెడ్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెడ్ల ఐక్యత, ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న విజయవాడలోని భవానిపురం కొండవీటి రెడ్డి భవనంలో రెడ్ల ఐక్యత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు రాజకీయాలు, హోదాలకు అతీతంగా రెడ్లు సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారుపల్లె జగన్మోహన్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, అమ్మిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భూమిరెడ్డిపల్లె నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఐటిఐలో చేరేందుకు 31లోగా దరఖాస్తు చేసుకోండి

చక్రాయపేట : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో 2023-2024. విద్యా విద్యాసంవత్సరానికి సంబంధించి రెండో విడత ప్రవేశానికి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపల్ వై.రాధాకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణతలై, 40 ఏళ్లు కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్వయంగా అయితే పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకొని ఐటిఐలో సంప్రదిస్తే ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయగలమన్నారు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.